సాక్షి ప్రకాశం

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



కంభంలో చోరీ

ఓ ఇంట్లో దొంగలు పడి రూ.లక్షన్నర నగదు, మూడు వెండి గిన్నెలు అపహరించుకెళ్లిన ఘటన కంభం పట్టణంలోని అంకాళమ్మ వీధిలో చోటుచేసుకుంది.

- 8లో..



పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33/24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

త్రిపురాంతకం: జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సివిల్ సప్లై డీఎం జీ వరలక్ష్మి తెలిపారు. త్రిపురాంతకం మండలం విశ్వనాథపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన ఆమె మాట్లాడుతూ జిల్లాలో 13 రైస్‌మిల్లుల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఇప్పటి వరకు 1100 టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. 150 మంది రైతులకు రూ.1.50 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. 50 శాతం రైతులకు చెల్లింపులు జరిగాయని, సకాలంలో చెల్లిస్తారన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వరలక్ష్మి తెలిపారు.

జిల్లా వైద్యాధికారిగా వెంకటేశ్వర్లు



తెలగతోటి వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా తెలగతోటి వెంకటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ గా చేస్తున్నారు. గతంలో ఆయన ప్రకాశం జిల్లాలో ప్రాజెక్ట్ ఆఫీసర్ డిస్టిక్ట్ ట్రైనింగ్ టీమ్ (పీడీటీ)గా విధులు నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షునిగా కూడా చేశారు. అద్దంకికి చెందిన ఆయనకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సమాచారం. ఈ క్రమంలోనే మంత్రి రవి ఆయనకు మాట ఇచ్చిఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆమధ్య పూర్వ డీఎంహెచ్ఓ రత్నావళికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ ఆమెకు రికమెండ్ చేసినట్లు ప్రచారం జరిగింది. ఆమెకు ఆర్డర్ వేసిన కొద్ది సేపటికే రద్దు చేయడం చర్చనీయాంశం అయింది. మంత్రి రవి అభ్యంతరం చెప్పడం వల్లనే ఆమెకు ఇచ్చిన పోస్టింగ్ నిలిపేసినట్లు వైద్యారోగ్య శాఖలోని ఉద్యోగులు గుసగుసలాడారు. అప్పుడే వెంకటేశ్వరరావు వస్తారని ప్రచారం జరిగింది. అందరూ అనుకున్నట్లే ఇప్పుడు వెంకటేశ్వర్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జిల్లాలో అంబరాన్నంటాయి. ఊరూ వాడా హ్యాపీ బర్త్‌డే జగనన్న అనే నినాదంతో హోరెత్తింది. కేక్ కటింగ్‌లు, అన్నదానం, వస్త్రదానం, రక్తదానం, ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రగతి ప్రదాత మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు



యర్రగొండపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ప్రగతి ప్రదాతా.. వర్ధిల్లు నూరేళ్లు..

- జిల్లాలో ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన నాయకులు
- రక్తదానం, అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ
- చెవిరెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది మహిళలకు చీరల పంపిణీ
- కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు
- హ్యాపీబర్త్‌డే జగనన్న అంటూ నినాదాలు
- నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: తమ ప్రియతమ నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పండుగలా నిర్వహించారు. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వేలాది మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు కేక్ కట్ చేసి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేలాది మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల బ్రహ్మానంద రెడ్డి జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ లు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు రక్తదానం చేశారు.

అనంతరం ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ జగనన్న పుట్టిన రోజు వేడుకలను తెలుగు వారంతా ఘనంగా నిర్వహించారన్నారు. ప్రజల కోసం ప్రజల నుంచి పుట్టినవాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజా నాయకుడి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతోందన్నారు. జనం పక్షాన నిలిచి వారి సమస్యల కోసం పోరాడుతోందని చెప్పారు. ఒంగోలు పార్లమెంట్ నుంచి జగనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారన్నారు. ప్రతి ఒక్కరూ రాబోయే రోజుల్లో మళ్లీ సీఎం గా వైఎస్ జగన్ రావాలని కోరుకుంటున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జననేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమానికి కృషి చేసిన నాయకుడు జగన్ అని కొనియాడారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ సంక్షేమ సారథి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్ జగన్ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఒంగోలు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అందరు కలిసికట్టు గా సమైక్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర రావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు నందకిషోర్, టాస్క్‌ఫోర్సు జిల్లా ఇన్‌చార్జ్ కె.వి.రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, తదితరులు జగనన్న కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా వేడుకలు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు.

■ దర్శిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జగనన్న పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 100 మంది వైఎస్సార్ సీపీ అభిమానులు రక్తదానం చేశారు. అంతకుముందు గడియారం స్తంభం సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ టంగుటూరులో నిర్వహించిన జగనన్న పుట్టిన రోజు వేడుకల్లో మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు.



కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు

■ మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు పాల్గొని కేక్ కట్ చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. పొదిలి పట్టణంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి నివాసంలో కేక్ కట్ చేశారు. మార్కాపురం పట్టణంలో పాతబస్టాండ్ లోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నారాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. తూర్పువీధిలో అన్నదానం చేశారు. మార్కాపురం పట్టణంలోని జంకె వెంకటరెడ్డి నివాసంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇందులో అన్నా రాంబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

■ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగనన్న పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. పార్టీ కార్యాలయం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

■ కనిగిరిలో జగనన్న జన్మదిన వేడుకలను కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 4 వేల మందికి చీరలు పంపిణీ చేశారు. 200 మంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

■ సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తిలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జగనన్న పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. మద్దిపాడు, సంతనూతలపాడు మండలాల్లో మాజీ మంత్రి మేరుగు నాగార్జున పాల్గొన్నారు.

రైతులకు అర్ధ రూపాయి విదల్చని

కూటమి ప్రభుత్వం

- విద్యుత్ చార్జీలను పెంచి మాటతప్పిన పచ్చ పార్టీ
- వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1100 కోట్లు కేటాయించి తాగు, సాగు నీరందించాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం ఏర్పడి అర్ధ సంవత్సరం దాటుతున్నా రైతులకు అర్ధ రూపాయి కూడా విదల్చకుండా మోసపు మాటలతో కాలం గడుపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలతోపాటు ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా, రాష్ట్ర స్థాయి కలెక్టరేట్‌లలో అర్జీలు ఇచ్చామని చెప్పారు. ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని మోసపు మాటలు చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాటను విస్మరించారని, ట్రూ అప్ పేరుతో కరెంటు చార్జీలను అధికంగా పెంచారని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసే సదుపాయాన్ని కూడా తిలోదకాలుఇచ్చి పాతబకాయిలు కూడా కట్టాలని మెమోలు జారీ చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం విధానాలపై నెల 27వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని, పేదవారిని ఆర్థికంగా కుదేలు చేస్తున్న ఈ ప్రభుత్వం చర్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు పెద్ద ఎత్తున ప్రజలతో ర్యాలీ చేపడుతున్నామని వెల్లడించారు. కూటమి నాయకులు విచ్చలవిడిగా బరితెగించి తక్కువ ధరలకు ఇసుక అమ్మకాలు జరిపే వ్యాపారులను బెదిరించి పెద్ద ఎత్తున ఇసుక నిలువలకు పాల్పడుతోందన్నారు. టన్ను ఇసుక రూ.1200 నుంచి రూ.1500కు అమ్ముతున్నారని అన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తామని, అప్పటికీ చర్యలు తీసుకోకపోతే ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి అయిన వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, నీటి నిలువ చేసుకునేందుకు ఖర్చుపెట్టాలని డిమాండ్ చేశారు. తాగు, సాగు నీరు అందించే ఈ ప్రాజెక్టుకు రూ.1100 కోట్లు కేటాయించి వెలిగొండ టన్నెల్ ద్వారా నీరు పారేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే యర్రగొండపాలెం నుంచి ప్రాజెక్టు వరకు పాదయాత్ర చేసి కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేస్తున్న తప్పిదాలే ప్రధాన కారణమన్నారు. మరోసారి కలెక్టర్‌తో కలిసి నీటి సమస్య, కమీషన్ల ప్రోత్సాహం గురించి చర్చిస్తానని చెప్పారు. రేషన్ మాఫియా, బెల్ట్ షాపులను కట్టడి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమస్యలపై కూడా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. నేడు జరిగిన జగనన్న జన్మదిన వేడుకలను చూస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉందా అన్నట్లు అనిపించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పడుతున్న ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా ప్రజలు ముందుకొచ్చి కార్యక్రమాలు జరిపారని చెప్పారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

పేదల సంక్షేమానికి పాటుపడిన వైఎస్ జగన్

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు వన్‌టౌన్: పేదల సంక్షేమం కోసం పాటు పడిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నగర ఉపాధ్యక్షుడు జనార్దన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలను ఆదుకునేందుకు కరోనాను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చిన మహోన్నత వ్యక్తి జగన్ అని కొనియాడారు. 32 సంక్షేమ పథకాల ద్వారా పేదలను అక్కున చేర్చుకున్నారన్నారు. ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ ఏసు ప్రభువు నేర్పింది ఒక మంచి జీవన విధానం, మంచి మార్గం అన్నారు. ప్రేమ, దయతో, కరుణతో ఉంటే ఎటువంటి కష్టాలు లేకుండా జీవించవచ్చని తెలిపారు. కల్లబొల్లి మాటలు చెప్పే వ్యక్తి జగన్ కాదని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. చంద్రబాబు సూపర్ 6 అని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, ఏమీ చేయడంలేదన్నారు. కార్యక్రమం అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఎక్స్ జెడ్పీటీసీ లంకపోతు అంజిరెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్, 14వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ ఇమ్రాన్, కోఆప్షన్ సభ్యురాలు ఎస్‌కె రషీదా, 15వ డివిజన్ ఇన్‌చార్జి మాసపల్లి రాజేష్, యరిచర్ల రాజు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరైన మహిళలు



ఒంగోలులోని వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్‌ జగన్‌ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న పార్టీ ఒంగోలు పార్లమెంట్‌ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చుండూరు రవిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాయకులు



ఒంగోలులోని వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాదాసి వెంకయ్య, నాయకులు



దర్శిలో పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ



సింగరాయకొండ: జగనన్న పుట్టినరోజు వేడుకల్లో మాజీ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌

జననేతకు జేజేలు..

మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు, ప్రజా సంక్షేమ సారథి జన్మదినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా పండుగలా నిర్వహించారు. వాడవాడలా కేక్‌ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలతో వైఎస్సార్‌ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించగా వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. జగనన్నకు జేజేలు అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

– సాక్షి, ఒంగోలు



దర్శిలోని వైఎస్సార్‌ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ



సంతనూతలపాడులో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి, వైఎస్సార్‌ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్‌ మేరుగు నాగార్జున, నాయకులు



వై.పాలెంలో బస్టాండ్‌ సెంటర్‌లోని వైఎస్సార్‌ విగ్రహానికి నివాళులర్పించేందుకు వైఎస్సార్‌ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌, నాయకులు



పొదిలిలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్‌ సీపీ నాయకులు



కనిగిరిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్‌



కంభంలో కేక్‌ కట్‌ చేసి నాయకులకు తినిపిస్తున్న వైఎస్సార్‌ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొగాకు బ్యారన్‌ దగ్ధం

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

ముండ్లమూరు (దర్శి): పొగాకు బ్యారన్‌ దగ్ధమై రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన ముండ్లమూరు మండలంలోని మారెళ్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు సుంకర బ్రహ్మానందరెడ్డి, సుంకర రమణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బ్యారన్‌లో ఒక్కసారిగా పెద్ద మంటలు చెలరేగాయి. లోపలున్న సామగ్రి, పొగాకు దగ్ధమైంది. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్‌ వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఈలోగా మోటార్ల ద్వారా నీరు చల్లి మంటలు ఆర్పాలని ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. బ్యారన్‌తో పాటు పొగాకు పూర్తిగా దగ్ధమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● పారిశుధ్య పనులు నిర్వహించిన కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా

ఒంగోలు అర్బన్‌: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని, అందరూ వారి నివాసాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీ రోణంకి గోపాలకృష్ణతో కలిసి పారిశుధ్య పనులను కలెక్టర్‌ నిర్వహించారు. స్వయంగా చీపుర్లు పట్టి కలెక్టరేట్‌లోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. జాయింట్‌ కలెక్టర్‌ కొడవలి చేతబట్టి కలుపు మొక్కలు తొలగించి చెత్తను టబ్‌లోకి ఎత్తి మున్సిపల్‌ ట్రాక్టర్ల వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లీన్‌ ప్రకాశం–గ్రీన్‌ ప్రకాశం నినాదంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల మూడో శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పాత ఫైల్స్‌ క్లియర్‌ చేసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జాయింట్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్ల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ చినఓబులేసు, మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

రైలు కిందపడి వ్యక్తి మృతి

కంభం: రైలు కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కంభం రైల్వేస్టేషన్‌ సమీపంలో శనివారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని కంభం రైల్వేస్టేషన్‌ సమీపంలో రైలు పట్టాలపై గుర్తించారు. అతని జేబులో ఒక హాస్పిటల్‌ రసీదు ఉంది. అందులో ఉన్న వివరాల ప్రకారం అతని పేరు జి.ప్రకాష్‌ అని తెలిసింది. అతనికి సంబంధించిన ఇతర వివరాలు తెలియరాలేదు. మృతుడు చామనచాయ రంగు కలిగి తెల్లని చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు నంద్యాల రైల్వే ఎస్సై (9440627653, 7702650514)కి సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ కోరారు.



రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహం

కంభంలో చోరీ

● రూ.లక్షన్నర నగదు, వెండి వస్తువుల అపహరణ

కంభం: ఓ ఇంట్లో దొంగలు పడి రూ.లక్షన్నర నగదు, మూడు వెండి గిన్నెలు అపహరించుకెళ్లిన సంఘటన కంభం పట్టణంలోని అంకాళమ్మవీధిలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. కంభం సచివాలయం–2 సమీపంలో నివాసం ఉంటున్న గంజి చిన్నవెంకటేశ్వర్లు మార్కాపురంలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం తిరిగి ఇంటికి రాగా తలుపు తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారు. మార్కాపురం క్లూజ్‌ టీమ్‌ సభ్యులు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. బాధితుడు మాట్లాడుతూ అరటి గెలలు అమ్మగా వచ్చిన డబ్బును అప్పులు తీర్చే నిమిత్తం ఇంట్లో ఉంచినట్లు తెలిపారు. ఊరికి వెళ్తూ వరండాలో తాళం చెవి దాచిపెట్టి వెళ్లామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల కంభంలో చోరీలు అధికంగా జరుగుతుండటంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

దర్శి: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన దర్శిలోని పొదిలి రోడ్డులో శనివారం జరిగింది. దర్శి పట్టణంలోని ఓ హోటల్లో పనిచేసే చల్లా శివప్రసాద్‌ (28) స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన శివప్రసాద్‌

దామచర్ల అవినీతిపై లేఖాస్త్రం

● ఎమ్మెల్యే దామచర్లపై సీఎంకు ఫిర్యాదు ?

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌ అవినీతికి పాల్పడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఫిర్యాదు చేసినట్లు సోషల్‌ మీడియాలో జరుగుతున్న ప్రచారం జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. ఆమేరకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్న లేఖ రెండు రోజులుగా వాట్సప్‌ గ్రూపుల్లో హల్‌చల్‌ చేస్తోంది. అయితే ఈ లేఖపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే ఒంగోలు నియోజకవర్గ టీడీపీ అభిమానులు, కార్యకర్తలు సీఎంకు ఫిర్యాదు చేశారా? లేక ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్లు లేఖ సృష్టించి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా సోషల్‌ మీడియాలో ప్రచారం చేస్తున్నారా అనేది సందేహంగా మారింది. టీడీపీ అభిమానులే ఈ ఫిర్యాదు చేసి ఉంటే ఫిర్యాదు లేఖను సోషల్‌ మీడియాలో పెట్టి ప్రచారం చేయాల్సిన అవసరం ఏముందన్నది తెలియాల్సి ఉంది. ఈ లేఖ విషయంపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

బ్యూటీషియన్‌ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

సంతనూతలపాడు: బ్యూటీషియన్‌ కోర్సులో ఉచిత శిక్షణకు ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, మహిళా ప్రాంగణం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ నుంచి సంతనూతలపాడులోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్కిల్‌ హబ్‌ కో ఆర్డినేటర్‌ షేక్‌ బాషా (99630 05209)ను సంప్రదించాలని కోరారు.